క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట ఎస్సీ కాలనీలో నిర్మించిన సీతారామాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. టీటీడీ నుంచి రూ.10 లక్షలు, జెడ్పీ చైర్మన్ కుటుంబ సభ్యులు రూ.20 లక్షలకు పైగానే ఆలయ నిర్మాణానికి ఖర్చు చేశారన్నారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది పురోహితులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. మొదటి రోజు జరిగే పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

బనగానపల్లెరూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా పోర్‌లైన్స్ రోడ్డుపై శ్రీ కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల విగ్రహావిష్కరణ ఉంటుందని, ప్రజా ప్రతి నిధులు, వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సీఐ జయచంద్ర సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణంలోని ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని విలువైన ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రాకపోకలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ మద్దిలేటి స్వామి ఆలయ ఈఓగా రామాంజనేయులు



బేతంచెర్ల: కర్నూలు దేవదాయశాఖ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై డిప్యూటీ కమిషనర్ హోదాలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈఓగా ఎం.రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఓగా విధులు నిర్వర్తించిన పాండు రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై జ్యూవెలరీ వెరిఫికేషన్ అధికారిగా వెళ్లారు. నూతన ఈఓ రామాంజనేయులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు.

చెత్త బుట్టల పంపిణీ


మహిళలకు టబ్, బకెట్‌లు పంపిణీ చేస్తున్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి

కొలిమిగుండ్ల: పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బెలుం గ్రామంలో ట్రస్ట్ అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తన తల్లి లక్ష్మీదేవమ్మతో కలిసి గ్రామస్తులకు వెయ్యి ప్లాస్టిక్ టబ్‌లు, బకెట్లు పంపిణీ చేశారు. చెత్తను వీధుల్లో పడేయవద్దని ఈసందర్భంగా ఆయన ప్రజలకు సూచించారు.

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ

డోన్ : ప్రభుత్వాసుపత్రిలో ప్రార్థన సమయం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం చేపట్టే పౌష్టికాహారం పంపిణీ కొనసాగింది. గర్భిణులు, బాలింతలు, రోగులకు రొట్టె, పప్పు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కర్నూలు పట్టణానికి చెందిన మర్రి రాము ఆర్థిక సాయంతో పౌష్టికాహారం పంపిణీ చేశామని ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ తెలిపారు.

కొనసాగుతున్న ఆలయ సంప్రోక్షణ పూజలు


బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో గ్రామ ప్రజలు, నరసింహస్వామి భక్త సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత మద్దిలేటినరసింహస్వామి ఆలయ సంప్రోక్షణ పూజలు రెండవ రోజు ఆదివారం కొనసాగాయి. ఉదయం వేదపండితులు స్వామివారికి అభిషేకం,శ్రీదేవి భూదేవి సమేత మద్దిలేటినరసింహ స్వామికి జపదీక్షా హోమం, సాయంత్రం కలశ పూజ నిర్వహించారు. కోలాట గురువులు నాయుడు, ప్రసాద్ ఆధ్వర్యంలో రాత్రి సాగిన కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.


కొండపైన గ్రామానికి ఏర్పాటు చేసిన తారు రోడ్డు


రోడ్డు విస్తరణ చేపట్టి వర్షపునీరు వెళ్లేందుకు కాల్వ తీసిన దృశ్యం

కొండమీదపల్లె... అభివృద్ధి నిండా!

- రూ.1.70 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- దశాబ్దాల సమస్యలకు పరిష్కారం.. సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


కొండమీదపల్లె వ్యూ


ప్రమాదకర మలుపు వద్ద వాల్ నిర్మించిన దృశ్యం



కొలిమిగుండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టణాలు, పంచాయతీలకే కాదు... కుగ్రామాలకు సైతం మౌలిక వసతులు కల్పిస్తుందనేందుకు ప్రత్యక్ష సాక్ష్యం మండల పరిధిలోని కొండమీదపల్లె. బనగానపల్లె నియోజకవర్గంలోనే కొండమీదపల్లె గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. సుమారు 600 అడుగుల ఎత్తులో కొండపై ఈ గ్రామం ఉంది. యాభై కుటుంబాలకు పైగానే ఇక్కడ నివాసం ఉంటున్నాయి. అంతా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉండటం విశేషం. ఊరి ప్రజలు అందరి కంటే అందనంత ఎత్తులో ఉన్నా వారి బాగోగులు పట్టించుకునే ప్రజా ప్రతినిధులే కరువయ్యారు. ఐదేళ్లకోసారి వచ్చే సాధారణ ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం ఆ ఊరు గుర్తుకొచ్చి కొండపైకి ఎక్కుతుంటారు ప్రజాప్రతినిధులు. అంతేతాప్ప అక్కడి ప్రజలకు ఏం కావాలి, మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా అని పట్టించుకునే నాథుడే లేడు. కొండపై గ్రామం ఉండటంతో తాగునీటి కోసం బోరు వేసే అవకాశాలు లేకుండా పోయాయి. దివంగత వైఎస్సార్‌సీపీ నేత ఎర్రబోతుల వెంకటరెడ్డి కొండ దిగువన బోరు వేసి డబల్ పంపింగ్‌తో కొండపైకి నీటి సౌకర్యం కల్పించి కొంత మేర ఉపశమనం కల్పించారు. అయితే ఏమాత్రం చిన్నసాంకేతిక సమస్య ఏర్పడినా కొండ తగ్గున ఉన్న బావి నుంచి నీళ్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. దశాబ్దాల నుంచి గ్రామస్తులు ఎదుర్కొంటున్న కష్టాలు ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలగిపోయాయి.

గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నెలల్లోనే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ కొడమీదిపల్లె గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ గ్రామ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ముందుగా దృష్టి సారించారు. రూ.1.70 కోట్లకు పైగానే వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పెట్నికోట–గొరిగ్రామనుపల్లె ప్రధాన రహదారి నుంచి కొండపైకి తారు రోడ్డు నిర్మించారు. మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేయించారు. త్వరలోనే ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు ఇచ్చి నీటి సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. తారు రోడ్డు నిర్మించినప్పటికీ చాలా చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఉండేవి. ఇటీవలనే జెడ్పీ చైర్మన్ కొండ పైభాగం నుంచి కింద వరకు రోడ్డు వెంట ప్రొక్లెయినర్‌తో తొలచి విశాలంగా ఉండేలా తీర్చిదిద్దారు. వర్షాకాలంలో నీరంతా రోడ్డుపైకి చేరి దెబ్బతినే ప్రమాదం ఉండటంతో కాల్వ ఏర్పాటు చేశారు. మలుపులు ఉన్న చోట కాంక్రీట్‌తో బెడ్‌తో సైడ్‌వాల్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఎన్నో ప్రభుత్వాలు, ఎంతో మంది ప్రజాప్రతినిధులు వచ్చినా గ్రామస్తులకు ప్రధానమైన రోడ్డు, నీటి సౌకర్యం కల్పించడంతో పూర్తిగా విఫలమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ రూపంలో ప్రధాన సమస్యలకు మోక్షం లభించడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


గ్రామంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

నీళ్ల కోసం బాగా ఇబ్బందులు పడ్డాం



ఊర్లో మంచినీళ్లు దొరికే అవకాశం లేక పోవడంతో కొండ తగ్గున ఉన్న చేదుడు బావి నుంచి బిందెలతో నీళ్లు ఎత్తుకొచ్చేవాళ్లం. ఆ కష్టాల వల్లే మోకాళ్ల నొప్పులు వచ్చాయి. ఇప్పుడు ట్యాంక్ కట్టారు. త్వరలోనే మాకు మంచి నీటి కష్టాలు లేకుండా పోతాయి. ట్యాంక్ నిర్మించి శాశ్వత పరిష్కారం చేస్తారని ఊహించుకోలేదు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ సాయం మరువం.

– లక్ష్మీదేవి, కొండమీదపల్లె

రోడ్డు సౌకర్యం కల్పించారు



ఏ చిన్న పని కోసం ఇతర ఊర్లకు పోవాలంటే రోడ్డు సౌకర్యం లేక కాలినడకన కొండ దిగిపోయేవాళ్లం. బంధువులు కూడా సరిగా మాఊరికి వచ్చేవాళ్లు కాదు. ఎద్దుల బండ్లపై పీపాలతో నీళ్లు మోసుకొచ్చేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వం వచ్చాక మాకు తారు రోడ్డు వేశారు. చాలా సంతోషంగా ఉంది. రోడ్డు, నీళ్లు మాకు కలగానే మిగిలిపోతాయనే అనుకునేవాళ్లం. ఎట్టకేలకు రెండు సమస్యలు పరిష్కారం అయ్యాయి. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు. – నారాయణరెడ్డి, కొండమీదపల్లె

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు పీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటి వేళల్లో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పీడర్ల విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, ముదిగేడు, అల్వకొండ, వసంతాపురం, కమలపూరి, గిద్దలూరు, కానా ల, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె పీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ తెలిపారు.

వార్డు సభ్యుడు నాగభూషణం మృతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని తాటిమాన్‌కొత్తూరు గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కుంటి నాగభూషణం (37) ఆదివారం కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. జనవరి16న జగదుర్తి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారని వివరించారు.

నలుగురిపై కేసు నమోదు

అవుకు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ తిరుపాలు ఆదివారం తెలిపారు. కర్ణాటకకు చెందిన హనుమంతప్ప అనే వ్యక్తి వద్ద ధాన్యాలకు సంబంధించి రూ.8.30లక్షలు ఇవ్వడంలేదనే విషయంపై అవుకు పట్టణానికి చెందిన రాజు, నాగరాజు, ఓబుళాపురం గ్రామానికి చెందిన నారాయణ, బాలు నంద్యాల టౌన్ నుంచి హనుమంతప్పను తీసుకొని వచ్చి ఓబుళాపురం గ్రామంలో నిర్బంధించి హింసించారు. బాధితుడు హనుమంతప్ప ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు గ్రామానికి చెందిన రామపుల్లయ్య(60) తల నొప్పి తీవ్రతను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య దయ్యాల దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ మద్దయ్య తెలిపారు.



ఆశాజనకంగా వరి సాగు

బనగానపల్లె : ఈ ఏడాది రబీలో వరి సాగు ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. గతేడాది రబీలో నియోజకవర్గంలో వ్యవసాయ బోర్లు, ఎస్సార్‌బీసీ ఆధారంగా సుమారు 4,200 హెక్టార్లు ఈ పంటను సాగు చేయగా ఈయేడు 5,300 హెక్టార్లలో సాగు చేసినట్లు వ్యసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వరి మంచి దిగుబడితోపాటు గిట్టుబాటు ధర లభించడంతో ఎకరానికి రూ.40–50వేలు మిగులు లభించింది. ఈ విధమైన మిగులు గతంలో ఎన్నడులభించలేదని రైతులు పేర్కొంటున్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారాను రసాయణ ఎరువులు సకాలంలో లభిస్తున్నం దున ఎరువుల సమస్యలేక పావడంతో ఈ సంవత్సరం రబీలో వరి పంటసాగు విస్తీర్ణం పెరిగిన్నట్లు రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. సాగు చేసిన ఈ పంటకు వాతావరణ పరిస్థితులు అనుకులంగా ఉన్నందున చీడపీడలు కూడా తక్కువగా ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు.

నేడు సీసీ రోడ్డు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

అవుకు: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20లక్షలు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీస్ నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. అదేవిధంగా 172 మందికి ఎమ్మెల్యే భూ పట్టాలను పంపిణీ చేస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సీసీ రోడ్డు

షాదీఖానా ముస్తాబు

- రేపు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ముదిగేడు రహదారి పక్కన నూతనంగా నిర్మించిన షాదీఖానా భవనం ప్రారంభానికి ముస్తాబైంది. పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు వివిధ శుభకార్యాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో షాదీఖానా భవన నిర్మాణానికి రూ. 1.20 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన భవన నిర్మాణం పూర్తయ్యింది. మంగళవారం ఎమ్మెల్యే కాటసాని షాదీఖానా భవనాన్ని ప్రారంభిస్తారని మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్‌మెంబర్ ఎస్ఏ గఫూర్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


రూ. 1.20 కోట్లతో నిర్మించిన షాదీఖానా

రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మ దహనం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని వెంకటాపురం రోడ్డులో ఉన్న వైఎస్ సర్కిల్ వద్ద ఆదివారం రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. రాహుల్‌గాంధీ ఒరిస్సా రాష్ట్రం జోడో యాత్రలో ప్రధాని మోదీ పుట్టుకతో ఓబీసీ కాదని... ఆ కులం తర్వాత చేర్చబడిందని అనుచిత వాఖ్యలు చేయడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా బీజేపీ, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భరణి రమేష్ తప్పుపట్టారు. ఇప్పటికైనా రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఫలితం చవిచూస్తారని హెచ్చరించారు.

వైభవంగా షిర్డీ సాయిబాబా గ్రామోత్సవం



బేతంచెర్ల: కర్నూలు రహదారిలో వెలసిన షిర్డీ సాయిబా ఆలయంలో ఆలయ 16 వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం బాబాకు అభిషేకం, కుంకుమార్చన, సచ్చరిత్ర పారాయణం మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరించిన రథంపై బాబా చిత్ర పటాన్ని ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కృపాధామ్ కమిటీ సభ్యులు బాబుల్ రెడ్డి, గుండా గోపాలు, వీరభద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట


ఎల్ఈడీ స్క్రీన్‌పై అభివృద్ధిని చూస్తున్న ప్రజలు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మండ్లవానిపల్లె గ్రామంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ని ఎల్ఈడీ స్క్రీన్‌పై గ్రామస్తులకు చూపించారు. పెద్దలతోపాటు పిల్లలు సైతం ఆసక్తిగా తిలకించారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు గణపతి, సీతా రామ లక్ష్మణ, హనుమత్, ధ్వజ, నాభిశిల, నవ గ్రహ విగ్రహాల ప్రతిష్ట, సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలను పురస్కరించుకొని 13న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ ఐదవ బహుమతులు వరుస రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 7వేలు రూ.5 వేలు, రూ. 3వేల చొప్పున అందజేశారు. అదేవిధంగా బెస్ట్ రైడర్ రూ.వెయ్యి, బెస్ట్ డిఫెండర్‌కు రూ. వెయ్యి అందజేస్తామని గ్రామస్తులు తెలిపారు.

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద నిర్మించిన నూతన దేవాలయంలో సోమవారం మూడురోజుల పాటు విగ్రహాల ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ దాత నాగేంద్ర ఆదివారం తెలిపారు. 14వ తేది ఉదయం యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని, 12.35గంటలకు అభిజిత్ లగ్నంలో శ్రీ కంబగిరి లక్ష్మీనరసింహ స్వామికి కల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పత్తికొండ శ్రీనివాసులు

డోన్ : మండలంలోని ఓబులాపురం కాశిరెడ్డినాయన రెండు రోజులుగా జరుగుతున్న 19వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం జరిగిన బండలాగుడు పోటీలతో ముగిసాయి. బండలాగుడు పోటీలను జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా లింగాల గ్రామానికి చెందిన అక్షరరెడ్డి వృషభాలు ప్రథమస్థానం, అనంతపురం జిల్లా సోమలదొడ్డి గ్రామానికి చెందిన బాడి రామాంజనేయులు, పెద్ద వడగూరు గ్రామానికి చెందిన ఈశ్వరప్రసాద్ వృషభాలు ద్వితీయస్థానం, వెలుగోడుకు చెందిన ఆయూబ్ బాషా వృషభాలు మూడవస్థానంలో, పెండేకల్ గ్రామానికి చెందిన నాగభూషణం వృషభాలు నాల్గవస్థానంలో నిలిచాయి. దాతలు పత్తికొండ శ్రీనివాసులు, చిన్న శ్రీరాములు, రేమట తిమ్మారెడ్డి, నాగరాజులు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాశిరెడ్డినాయన ఆశ్రమ గౌరవ అధ్యక్షులు ఆర్‌ఈ రాజవర్దన్, ఆశ్రమ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


ఓబులాపురంలో వెలసిన కాశిరెడ్డినాయన

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో మాఘమాసాన్ని పురస్కరించుకొని వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల మోహన్‌రావు, గురవయ్య, వాసవీ మహిళా మండలి సభ్యులు, వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో వేదపండితుల వాసవీ మాత ఉత్సవమూర్తికి నారికేల జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన మహా మంగళ హారతి నిర్వహించారు. అమ్మవారిశాలలో మొదటిసారిగా వాసవీమాత ఉత్సవమూర్తిని కొలువుంచి సహస్రనామవలితో పుష్పయాగం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు శేషా మోహన్, జానార్ధన్, లక్ష్మినారాయణ, సీఎల్ రామయ్య, బళ్లాని సూర్య, గుప్త, మాణిక్యం పాల్గొన్నారు.


పుష్పయాగంలో పాల్గొన్న మహిళలు

వాల్మీకి గుహలను సందర్శించిన గుత్తికోట సంరక్షణ సమితి సభ్యులు

ప్యాపిలి: బోయవాండ్లపల్లి సమీపంలో వెలసిన పర్యాటక కేంద్రం వాల్మీకి గుహలను అనంతపురం జిల్లా గుత్తికోట సంరక్షణ సమితి సభ్యులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ నేత, గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో కలసి వాల్మీకి గుహలను సందర్శించినట్లు తెలిపారు. సహజసిద్ధంగా ఏర్పడిన గుహల అందాల గురించి మాటల్లో వర్ణించలేమని ఆయన అన్నారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చిన వాల్మీకి గుహలను ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుత్తికోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీరావు, సలహాదారుడు గురుశంకర్, నాయకులు జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి గుహల ఆవరణలో గుత్తికోట సంరక్షణ సమితి సభ్యులు

గిరిజనులు చైతన్యం కావాలి

ప్యాపిలి: గిరిజనులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చైతన్యవంతులు కావాలని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బైరి ఓంకార్ అన్నారు. మండల పరిధిలోని ఎస్ రంగాపురంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు, ఎరుకల సోదరులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చైతన్యవంతులు అయితేనే గిరిజనుల స్థితిగతులు బాగుపడతాయన్నారు. అనంతరం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఏపీటీఎఫ్‌లో చేరాయి. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరమేసి పరమేశ్, అధ్యక్షుడు మెడసారి సుంకన్న, జిల్లా గౌరవాధ్యక్షుడు మరమేసి నాగన్న, మండల అధ్యక్షుడు ఎరుకల బాలరాజు, మండల కార్యదర్శి మరమేసి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.


ఏపీటీఎఫ్ సభ్యత్వం పొందిన ఎస్ రంగాపురం గ్రామస్తులు